
# కామన దుఃఖ కారకము కామన పీడకు కన్నతల్లి

ప్రవాసి



మహాత్మ ఇబ్రహీం కొండెక్కి ఎటో వెడుతున్నారు. కొండ మీద దానిమ్మ చెట్లెన్నో వున్నాయి. కొమ్మ కొమ్మ మీద దానిమ్మకాయలు విరగకాశాయి. ఇబ్రహీంకి దానిమ్మ పండు తినాలన్న కోరిక కలిగింది. ఇబ్రహీం ఓ పండుకోసి తినబోయి భరించరానంత పుల్లగా వుండటంతో పారేసి ముందుకు నడుచుకుంటూ పోయాడు. కొంచెం దూరం నడిచాక దోవ పక్కన పడుకున్న ఓ మనిషి తారసపడ్డాడు. అతడిని అసంఖ్యాకమైన దోమలు కరుస్తున్నాయి. కానీ అతను వాటిని తరమేయత్నం ఎంత మాత్రం చేయటం లేదు. ఇబ్రహీం వెళ్ళి అతనికి నమస్కారం చేశాడు. అతను "ఇబ్రహీం ఒచ్చావా చాలా సంతోషం" అన్నాడు.

ఒక అపరిచిత వ్యక్తితనని పేరెట్టి పిలవడంతో ఇబ్రహీంకి ఆశ్చర్యమయ్యింది. "తమరు నన్నెట్టా పోల్చుకున్నారు" అని అతన్ని ప్రశ్నించాడు ఇబ్రహీం. "భగవత్ప్రాప్తి అయిన వ్యక్తికి రహస్యం అంటూ ఏది వుండదు" అన్నాడావ్యక్తి.

"తమరు భగవత్ప్రాప్తి అయిన వారు కదా. ఈ దోమలని మీనించి దూరం చెయ్యమని భగవంతుడి నెందుకు ప్రార్థించరు" అని ప్రశ్నించాడు ఇబ్రహీం.

"ఇబ్రహీం నీక్కూడా భగవత్ప్రాప్తి అయ్యింది కదా. దోవలో దానిమ్మ పండు తినాలన్న కామన నీ హృదయంలో పుట్టించవద్దని భగవంతుడి నెందుకు ప్రార్థించలేదు. దోమలు శరీరాన్ని బాధిస్తాయి. కామన హృదయాన్ని పీడిస్తుంది. కామన దుఃఖ కారకము కామన పీడకు కన్నతల్లి" అన్నారాయన. ఈ కథనం నిజమైన భక్తుడు భగవంతుడ్ని ఏమి అడగడనీ, భగవంతుడు ఇచ్చిన వేదనైనా ఆనందమైన వరదానంగా స్వీకరించి అనుభవిస్తాడని తెలుపుతుంది. ❊

